# ఆస్వాదన

సాయంత్రం ఆరున్నర.

అది బొంబాయి ఆంధ్రమహాసభ ప్రాంగణం.

పెళ్లి రిసెప్షన్‌కు సూచికగా, వేదికపై రెండు సింహాసనాలు. పైన వధూవరుల పేర్లు. లోగిలంతా రంగురంగుల షామియానా. ప్రాంగణం కళాత్మకమైన విద్యుద్దీపాలతో మెరుస్తోంది. కేటరింగ్ వారు, వారి వారి విధుల్లో ఉన్నారు. కూరగాయలతో అందమైన ఆకృతులు చెక్కిన వేదిక, ఆహుతులను ఆకర్షిస్తోంది. పైన అయిదు బెడ్ల రూములో నలుగురు మిత్రులు కూర్చుని పిచ్చాపాటీలో పడ్డారు. వారంతా కాలేజీ వదిలి పాతికేళ్ళు. ఆ పంచపాండవుల్లోని అయిదో మిత్రుడు గణేశ్వర్ కూతురి పెళ్లి సందర్భంగా వారు ముంబయిలో కలిసే యోగం కలిగింది. పగలు శాస్త్రయుక్తంగా పెళ్లి. ఆ తర్వాత కమ్మని భోజనం వడ్డింపు (బఫే కాదు). భుక్తాయాసం తీర్చుకుని, టీ సేవించి యూనివర్సిటీలోని తమ కాలేజీ జీవితం నెమరు వేసుకున్నారు. ఆ తర్వాత చర్చ, వారి కుటుంబ జీవితం, ఉద్యోగ పర్వంమీదికి మళ్లింది.

"మెకానికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ కాగానే మారుతీ గుర్‌గాం ప్లాంటులో ఉద్యోగం వచ్చింది. రెండేళ్ల తర్వాత పెళ్లి. ఆ తర్వాత నాలుగు సంవత్సరాల్లో పాప, బాబు" ముగించాడు గురుప్రసాద్.

"నువ్వు టెలిగ్రాఫ్ డిపార్ట్‌మెంట్‌లో ఉండాల్సింది" శాంతకుమార్ అందుకుని కొనసాగించాడు. వెనకటికెవడో నీ లాంటివాడు, రామాయణం చెప్పరా అంటే 'కట్టె, కొట్టె, తెచ్చె అన్నాడట.' "దాని భావమేమి శాంతకుమారా?" గంగమోహన్ సందేహం.

"రామాయణంలో పిడకలవేటలా నువ్వొహడివి. ఆమాత్రం తెలీదూ? వారధి కట్టే, రావణుని కొట్టె, సీతను తెచ్చే."

"మరి వారధి కట్టడానికి పూర్వపు కథో" రాజేశ్వర్ ఉడికింపు.

"ఓరి నీ ధర్మసందేహం మీద కడపబాంబులు పడా. ప్రస్తుతం మనం మన కాలేజి తర్వాతి జీవితం గురించి చెప్పుకుంటాం. రామాయణ పారాయణం కాదు. ఆ, చెప్పవయ్యా గురూ! ఎన్ని ప్రమోషన్లు కొట్టావు? ఏమేం సంపాదించావ్? గంగమోహన్, టాపిక్ వదల్లేదు.

"మారుతీలో జేరింతర్వాత సేను పక్కా ఉత్తరాది వాణ్ణయ్యాను. క్వార్టర్సులో కొన్నాళ్ళుండి, సొంత సైటులో ఇల్లు కట్టుకున్నాను. ఉద్యోగ సోపానంలో నాలుగయిదు మెట్లెక్కి ప్రస్తుతం చీఫ్ ఆఫ్ ఆపరేషన్స్ (ప్రొడక్షన్)గా ఉన్నాను. ఏదో జీవితం సాఫీగా సాగుతోంది" గురుప్రసాద్‌లో అదే మితభాషణ.

"శాంతా! ఇక నీ వంతు" శాంతకుమార్‌వైపు తిరిగాడు గంగమోహన్.

"మీకు తెలుసుగా, మన డిగ్రీ కాగానే భెల్ (బి.హెచ్.ఇ.ఎల్.)లో ట్రైనీ ఇంజినీయరుగా చేరాను. ప్రమోషన్‌పై భోపాల్ వెళ్లి, అక్కడ అయిదు సంవత్సరాలు చేయగానే హోమ్ సిక్‌నెస్ వచ్చింది. ఎన్నో పైరవీలు చేసి తిరిగి భాగ్యనగరం వచ్చాను. రెండేళ్ళక్రితం వి.ఆర్.ఎస్. తీసుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం భాగస్వామ్యంలో ఓ స్పేర్ పార్ట్ ఫ్యాక్టరీ పెట్టాను. మా సప్లై అంతా భెల్‌కే. అలా పరోక్షంగా కూడా భెల్ నన్ను ఆదుకుంటోంది. ఇక కుటుంబ విషయానికొస్తే ఇద్దరాడపిల్లలు, ఒక, తల కొరివిపెట్టేవాడు. పెళ్లయిన తర్వాత పెద్దమ్మాయి అమెరికా వెళ్లింది. చిన్నమ్మాయి ఎమ్మెస్సీ చేస్తోంది. ఇక సుపుత్రుడు ఇంజనీరింగ్ చేసి, అప్లికేషన్ల పర్వంలో రెండేళ్లు గడిపి ఇప్పుడు మా ఫ్యాక్టరీ చూసుకుంటున్నారు. ఈ ఫ్యాక్టరీ, ఒక విధంగా నేను వాడికోసమే పెట్టాను. ఇక సంపాదనకొస్తే, రామచంద్రపురంలో డాబా ఇల్లు, మియాపూర్‌లో రెండెకరాలు, అవి ఇళ్ళ సైట్లుగా మారుస్తున్నాను. ఫ్యాక్టరీలో భాగస్వామ్యం, కొంత బ్యాంక్ బ్యాలెన్సు, చిట్టీలు" శాంతకుమార్ ముగించాడు.

"నీకు కాలేజీ రోజుల్లో వ్యాసరచనకు బహుమతులు ఊరకే రాలేదు. పాతికేళ్ళ జీవితాన్ని పాతిక వాక్యాల్లో చెప్పావు" అది ప్రశంసో, వెటకారమో తెలీని టోన్‌లో అని "ఆ, రాజేశ్వర్ నీ మాటేమి?" అనడిగాడు గంగమోహన్.

"మా అందరితో చెప్పించుకుని, ఆ తర్వాత రిసెప్షన్‌కి టైమైమందని తప్పించుకోవాలని చూస్తున్నావా? అదేం కుదరదు. ముందు నీ సంగతి చెప్పు" రాజేశ్వర్.

"నా గురించి మీకు తెలీందేముంది? మీరెవ్వరూ జవాబివ్వకపోయినా ఎప్పటికప్పుడు నా విషయాలు తెలుపుతూనే ఉన్నాగా! అయినా మీ మాటెందుకు కాదనాలి? వినండి. జీవితంలో పైకెదగాలంటే ఎదుగూబొదుగూ లేని ప్రభుత్వరంగంకంటే, ప్రైవేటురంగమే నయమని, భోపాల్‌లో ఓ చిన్న కంపెనీలో ప్లాంట్ సూపర్‌వైజర్‌గా చేరాను. పై పదవుల వేటలో మూడు నాలుగు కంపెనీలు మారి ప్రస్తుతం ఓ రెండు వేల కోట్ల కంపెనీలో ప్లాంట్ ఇన్‌చార్జిగా ఉన్నాను. మన రాష్ట్రంలో మనకెలాగూ విలువ లేదు కాబట్టి భోపాల్‌లోనే స్థిరపడ్డాను. పెద్ద బంగళా, రెండు కార్లు, నౌకర్లూ అన్ని హంగులూ అమర్చుకున్నాను. మీలా నాకు పెన్షనుండదు కాబట్టి ఇన్సూరెన్స్, మ్యూచువల్ ఫండ్లలోని పెట్టుబడులతో నా రిటైర్డ్ లైఫ్ సాఫీగా సాగేలా ప్లాన్ చేసుకున్నాను. పిల్లల విషయానికొస్తే, ఒకబ్బాయితో సరిపెట్టుకున్నాం. అబ్బాయి భోపాల్లోనే డాక్టర్ ప్రాక్టీసు పెట్టాడు. కోడలు కూడా డాక్టరే. రెండేళ్ళలో నర్సింగ్‌హోమ్‌కు ప్లాను చేస్తున్నారు. రోజూ క్లబ్బులో ఆటలు, మందు హాయిగా జీవితం జుర్రుకుంటున్నాను" గంగమోహన్.

"ఇక నా విషయానికొస్తే" రాజేశ్వర్ కొనసాగించాడు. "డిగ్రీ పరీక్షలు కాగానే యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా వారి వ్రాత పరీక్ష రాసాను. ఇంజినీరింగ్ ఫలితాలకు ముందే బ్యాంకులో సెలక్టయినట్టు లెటరొచ్చింది. రిజల్ట్స్ రావడం ఆలస్యం, రెక్కలు కట్టుకుని బొంబాయిలో వాలాను. బ్యాంకులో టెక్నికల్ ఆఫీసరుగా జీవితం మొదలైంది. వివిధ ఫ్యాక్టరీలు విజిట్ చేయడం, అవి సాంకేతికంగా రాణింపగలుగుతాయో లేదో, వారు ఇచ్చిన వివరాలు సరి అయినవో కావో, పరీక్షించడం, రిపోర్ట్సు రాయడం. దాన్నిబట్టి, బ్యాంకువాళ్లు లోను ఇవ్వాలో, వద్దో నిర్ణయించడం, కొన్నిరోజులకు అంతా రొటీన్‌గా మారిపోయింది. రెండేళ్లకే మొహమెత్తింది. నా సాంకేతిక పరిజ్ఞానం మరచిపోతానేమో అనే భయం పట్టుకుంది.

దాంతో ఏదైనా ఉత్పత్తి పరిశ్రమలో ఉద్యోగం కొరకు ప్రయత్నించాను. రెండు మూడు ప్రైవేటు సంస్థల్లో చేసి రిలయన్స్ కంపెనీలో స్థిరపడ్డాను."

"ఏ.సి. ఆఫీసులో కుర్చీమీద కూర్చుని, కాలు మీద కాలేసుకునే అవకాశం, గవర్నమెంటు బ్యాంకులోని భద్రతను వదలి, ప్రైవేటు సంస్థలో చేరడానికి నీ మనసెలా ఒప్పింది? అంత రిస్క్ ఎందుకు తీసుకున్నావ్?" శాంతకుమార్ వ్యాకులం.

"మన రాష్ట్రంలో ఉంటే బహుశ నేనూ నీలా ఆలోచించేవాడినేమో! కానీ బొంబాయి వచ్చింతర్వాత, నా ఆలోచనాసరళి మారింది. ప్రభుత్వ బ్యాంకులో నైపుణ్యానికి స్థానం లేదనిపించింది. పనిచేసేవాడికి, చేయనివాడికీ ఒకే ఇంక్రిమెంటు, సీనియారిటీతోనే ప్రమోషన్లు, వాటిలో ఎన్నో రాజకీయాలు. అవి నాకు పడలేదు. పని దొంగలకు ప్రభుత్వోగాల బాసట కావాలి గాని, పనిమంతులకు కాదు. అందుకే మెరిట్‌కు పెద్దపీట వేసే ప్రైవేట్ రంగాన్ని ఎన్నుకున్నాను. వృత్తిపరంగా సంతృప్తి ఉంది. ఇక కుటుంబ విషయాని కొస్తే ఒక పాప, బాబు. పాప ఇంజనీరింగు ఫైనల్ ఇయర్, బాబు బీ.కామ్. చేస్తున్నారు.

"అదేమిటి? అబ్బాయిని కామర్సులో చేర్చావు?"

అమ్మాయిని ఏదో బి.ఏ.లో చేర్చి కాలేజి అయిందనిపించే వాళ్లంటే నాకు మంట. అబ్బాయిలను ఇంజనీరో, డాక్టరో చేయాలని డొనేషన్లు కట్టేవాళ్ళంటే కూడా నాకు మంట. ఎవరి అభిరుచులకు తగ్గట్టు మా పిల్లలను వారి వారి కోర్సుల్లో చేర్చాను. ఏ ఫ్యాకల్టీలోనైనా ఉన్నత శిఖరాలకు చేరితే ప్రతివారికీ మంచి భవిష్యత్తుంది. నిజానికి ఈ రోజుల్లో సి.ఏ కు ఉన్న విలువ ఇంజనీరుకు లేదు.

"కాలేజీలో కూడా నీది ఏటికి ఎదురీదే ధోరణే. జీవితంలో ఎలా నెగ్గుకొస్తావో అనుకునేవాళ్ళం. చూస్తే నీవే మా అందరికంటే మంచిహోదాలో ఉన్నావు. ఏ మాత్రం వెనకేశావేమిటి? గంగమోహన్ కుతూహలం "మీ అంత మాత్రం కాదు. ఇక్కడ ప్రభాదేవిలో త్రీ బెడ్‌రూం ఫ్లాటు, షేర్లలో కొంత, ఇన్స్యూరెన్సు పాలసీలు, గోవాటైమ్‌షేర్‌లో పెట్టుబడి.

"ఈ టైమ్‌షేరేమిటి?" శాంతకుమార్ అడిగాడు.

"టైమ్‌షేర్ అంటే వసతి సౌకర్యాన్ని సమయం వారీగా పంచుకోవడం. సెలవులు హాయిగా గడుపుకోవడానికి దోహదపరిచే పథకం ఇది. విదేశాల్లోలాగా ఇక్కడా ఫైవ్‌స్టార్ రిసార్టులు వెలిసాయి. ఒక్కో అపార్టుమెంటును వారాల వారీగా అమ్ముతారు. అంటే ఒక్కో అపార్టుమెంటుకు వారానికొక్కటి చొప్పున సంవత్సరానికి యాభై ఇద్దరు అధిపతులు ఉంటారు. హోటల్లో లాగ రూముకు ఇద్దరుగా కాకుండా ఈ అపార్ట్‌మెంట్ రిసార్ట్‌లో హాలు, బెడ్‌రూం వంటగది ఉంటాయి. కుటుంబమంతా ఇంట్లో లాగ ఒకే అపార్ట్‌మెంట్‌లో ఉండవచ్చు. జిమ్, సౌనాబాత్, స్విమ్మింగ్ పూల్ లాంటి ఫైవ్‌స్టార్ హోటల్లోని అన్ని హంగులూ వీటిలో ఉంటాయి. రెండు లక్షలతో నేను సింగిల్ బెడ్ అపార్ట్‌మెంట్ కొన్నాను. దాదాపు ప్రతిసంవత్సరం మేమంతా ఓ వారం రోజుల పాటు దేశంలోనో, విదేశాల్లోనో గడిపి వస్తాం. మనదేశంలోనైతే నలభై నుండి యాభైవేలు, విదేశాల్లోనైతే, రెండు లక్షలు ఖరీదు చేసే వారం రోజుల వసతి సౌకర్యం, మాకు కేవలం రెండు లక్షల పెట్టుబడి, ప్రతి సంవత్సరం కొంత ఫీజుతోనే వస్తోంది" రాజేశ్వర్ వివరించాడు.

"ఏమిటేమిటి? రెండు లక్షల పెట్టుబడితో ప్రతి సంవత్సరం దేశవిదేశాల్లో వారం

రోజుల వసతి సౌకర్యమా?" శాంతకుమార్.

"మన టైమ్‌శేర్ మార్పిడి చేసుకునే వీలు వల్ల ప్రపంచంలోని దాదాపు నాలుగువేల రిసార్టుల్లో వసతి సౌకర్యం ఉచితంగా లభిస్తుంది" రాజేశ్వర్ విడమర్చాడు.

"అవును ఇలాంటి ఆఫర్ నాకూ వచ్చింది. ఎవరో ఫోన్ చేసి స్టార్ హోటల్‌కి కుటుంబంతో సహా ఆహ్వానించారు. తీరా వెళితే ఇప్పుడు రాజేశ్వర్ చెప్పిందే వీడియో ప్రజంటేషన్‌గా చూపించారు. ఆ వసతులు చూసి కళ్ళు చెదిరినా, ఆ కంపెనీపై నమ్మకం లేక కొంత కేవలం విలాసాలకు అంతంత పెట్టుబడి వెచ్చించడం ఇష్టం లేక కొంత మొత్తం మీద నేను ఆ స్కీమ్‌లో చేరనని చెప్పాను." గంగమోహన్ తన అనుభవం పంచుకున్నాడు.

"అవును టైమ్ శేరో అదేదో దాంట్లో అంత పెట్టుబడిపెట్టి ప్రతి సంవత్సరం సెలవులు గడపడానికి వేరు వేరు ప్రదేశాలకు వెళ్ళడం వాటి రాకపోకలకు భోజనం, ఇతర ఖర్చులకు అమ్మమ్మో, ఎంత వృధా ఖర్చు? నువు ప్రతి సంవత్సరం చేసే ఆ ఖర్చుతో హైద్రాబాదులో ఎన్ని సైట్లు వచ్చేవో? ఏ అనాధశరణాలయానికో దానం చేస్తే ఇంత పుణ్యమన్నా దక్కేది". శాంతకుమార్ గుండె బాదుకున్నాడు.

"ప్రతి పనికి కేటాయింపు చేసుకుంటే ఇలాంటి వైరుధ్యాలు తలెత్తవు. తనకు మాలిన ధర్మం కాకుండా నేను చేసే గుప్తదానాలు చేస్తూనే ఉన్నాను. మా కుటుంబానికి లోటు లేకుండా చూసుకుంటున్నాను. నా రిటైర్‌మెంట్ తర్వాతికి కూడా ప్లాన్ చేశాను. నేను వర్తమానంలో జీవించే మనిషిని. ఆస్తులు కూడబెట్టడంలో నాకు నమ్మకం లేదు. ఎన్నాళ్ళు బతికామని కాకుండా ఎలా బతికామన్నదే నాకు ముఖ్యం. జీవితాన్ని ఆస్వాదించడమే నా ధ్యేయం పిల్లలకేదో ఆస్తులు సంపాదించి పెట్టాలనేది నా అభిమతం కాదు. వారికి నచ్చిన చదువులు చెప్పించి మంచి సంస్కారం అలవరిస్తే చాలు. వారి జీవితం వాళ్ళు బతుకుతారు. వాళ్ళ ఇళ్ళు వారు సమకూర్చుకుంటారు.

కేరళలోని ప్రకృతి సౌందర్యం, యు.పి. రాజస్థాన్‌లోని చారిత్రక కట్టడాలు ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడులోని దేవాలయాలు, ఉత్తరాదిలోని పవిత్రయాత్రాస్థలాలూ, కులుమనాలి, సిమ్లా డార్జిలింగ్, ఊటీ, కొడైకెనాల్ వంటి హిల్‌స్టేషన్లు, దేన్నీ వదలిపెట్టలేదు.

టైమ్‌శేర్ పుణ్యాన ఇన్ని ప్రదేశాలు తిరుగగలిగాము. ఓసారి యూరప్, ఓసారి అమెరికా కూడా చుట్టివచ్చాము. మా పర్యటనల్లోని అనుభూతులను మాటల్లో చెప్పలేను. వివిధ ప్రదేశాలు తిరగడంతో తీపిగుర్తులతోపాటు మా ఆలోచనా పరిధి కూడా విస్తృతమైంది. వేరు వేరు ప్రజలతో వారి ఆచారవ్యవహారాలతో పరిచయం పెరిగింది. సెలవులనుండి రాగానే కొత్త ఉత్తేజం కొత్త శక్తి. దానితో పనిలో అనుకోకుండానే మెరుగుదనం. ఉద్యోగంలో ప్రమోషన్లు. మా పిల్లలు కూడా, చదువు ఎక్కువ సమయం వెచ్చించకనే మంచి మార్కులు సంపాదించుకుంటున్నారు. ఆస్తులు కూడ బెట్టడం అవసరమే కాని, అదే పరమావధి కాకూడదు. నా దృష్టిలో భుక్తికి, కొన్ని కనీస సౌకర్యాలకు లోటు లేకుండా మన పిల్లలను పెంచితే చాలు, అంతేకాని మన తరువాత తరతరాలు తిన్నా తరగని ఆస్తులు సంపాదించాలనుకోవడం అత్యాశ అవుతుంది. అదే జీవితంలో అడ్డదార్లు తొక్కడానికి ప్రేరేపిస్తుంది" రాజేశ్వర్ సీరియస్‌గా ముగించాడు.

"హమ్మయ్య, నీ క్లాసు పీకడం అయిపోయిందా నాయనా, కాలేజిలోని డిబేటింగ్

నైపుణ్యం ఇంకా సన్నగిల్లలేదు తేనె తుట్టిని కదిపినట్టయింది" శాంతకుమార్ అవహేళన.

"మొత్తం మీద మన పాండవుల జీవితాలు కొన్ని ఎక్స్‌ప్రెస్‌లు కొన్ని సూపర్‌ఫాస్ట్‌లు. అన్నీ పట్టాల మీదే ఉన్నాయి. మన బ్యాచ్ అదృష్టమది" గంగమోహన్ ఉవాచ.

"మీరింకా భాతాకానీలోనే ఉన్నారా? అక్కడ క్రింద అందరూ మీ కోసం అడుగుతున్నారు" గణేశ్వర్ మిత్రులను లేవదీసి రిసెప్షన్ వైపు దారి తీసాడు. మనమూ వారితో పాటే వెళదామా?

**నేటి నిజం 15-8-2004**